క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు



కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు

ఏలూరు(మెట్రో): జిల్లా విజిలెన్సు కమిటీ సభ్యులుగా నియమితులైన పొలిమేర హరికృష్ణ, విశాల చంద్రశేఖర్‌లు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

చితికిన బాల్యంపై ప్రదర్శన

పెదపాడు: బాలికలు బాల్య వివాహంపై అవగాహన అవసరమని క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు అన్నారు. పెదపాడు మండలం పాత ముప్పర్రులో సర్పంచ్ సహకారంతో పంచాయతీ బాలలతో చిన్నతనంలోనే పెళ్లి కారణంగా చితికిన బాల్యం అనే వీధి నాటకాన్ని మంగళవారం ప్రదర్శించారు. బాల్య వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను, చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఎంసీ చైర్మన్ రూప, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ వాయిదా

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఆటల పోటీలు వర్షాల కారణంగా వాయిదా వేశామని దెందులూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ కే.రాజగోపాల్ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ వాయిదా వేసిన పోటీలు ఈ నెల 23న శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. 22న పెదవేగి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను మాత్రమే తీసుకురావాలన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

దెందులూరు: నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన తహసీల్దార్‌గా జె.శ్రీనివాసరావు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కేఆర్‌సీసీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించినట్టు ఆయన తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్య సాధనకు కృషి

పెదపాడు: విద్యార్థులు తమ సమయాన్ని చదువుకోసం వినియోగించి మంచి ఫలితాలు అందించాలని చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబరు జె. రాజేంద్రప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత స్వేచ్ఛ, లక్ష్య సాధనకు చేయాల్సిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన వెట్ గ్రైండర్‌ను పాఠశాలకు బహూకరించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

గణపవరం: కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, తక్షణం వైద్య సహాయం పొందాలని గణపవరం వైఎస్సార్ కంటి వెలుగు అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కాశిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నిమ్మల వెంకటేశ్వరరావు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏకదంతాయ.. మనసాస్మరామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు నగరంలో వాడవాడలా సుందరంగా అలంకరించిన ప్రత్యేక పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథుల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పత్రులు, పండ్లతో పూజించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర ప్రజలు తమ గృహాల్లో పూజలు నిర్వహించుకున్న అనంతరం సాయంత్రం నుంచి తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు చేసి అక్షింతలను అర్చకులు భక్తులకు ఇచ్చి, ప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళవారం రెండో రోజు స్వామి వార్లు విశేష పూజలు అందుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో మూడో రోజున, మరికొన్ని ప్రాంతాల్లో ఐదో రోజున స్వామి వారి పూజలు ముగించి నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



కొత్తపేటలో ఎలుక వాహనంపై కొలువుదీరిన గణనాథుడు



చేపల తూము సెంటరులో..



జీహెచ్ సెంటరులో..



రామకోటిలో..

ప్రత్తికోళ్లలంకలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహకారంతో ప్రతి గ్రామంలో రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తిచేశామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక బీసీ, ఎస్సీ కాలనీల్లో రూ.45 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తంగా 15 గ్రామ పంచాయతీల్లో రూ.30 కోట్లు నుంచి రూ.35 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రైయినేజీ, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కన్నా 100 రెట్లు ఎక్కువ పనులు చేపట్టామని వివరించారు. కోమటిలంక, పెదయాగనమిల్లి, కొక్కిరాయిలంక గ్రామాల్లో సైతం రూ.కోట్ల అభివృద్ధి చేశామని చెప్పారు. గుడివాకలంకలో సహజీవన సహవాస చర్చి వెనకభాగంలో ఎస్సీ కాలనీ మొత్తంగా గ్రావెల్ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ప్రత్తికోళ్లలంకలో ఎస్సీ కాలనీల్లో ఒక కిలో మీటర్ సీసీరోడ్లు పనులు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీరు అందని ప్రాంతాలకు సైతం కోట్ల రూపాయలు వెచ్చించి పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసామన్నారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ బలే సత్యప్రసాద్, బంటా పెద్దలు ఉన్నారు.



ప్రత్తికోళ్లలంకలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీపీ, పెద్దలు

మౌలిక వసతులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలు నివశించే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగు కాలువలు, రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో దళిత సేన ఏలూరు జిల్లా అధ్యక్షుడు వరిగేటి చిన్నాబి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కపాము చంటి, నాయకులు పింగుల ఇథియ, విస్సన్నపల్లి సురేష్, పింగుల విజయమ్మ, మల్లిపూడి శంకర్రావు, ఆడిమిల్లి ఆదియ్య, చొదిమెళ్ల సుబ్బారావు, మనెల్లి అమృతరావు, బుల్లా రవికుమార్, కటారి రాటాలమ్మ, తగరం దేవదాస్, ఆరెల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

గణపవరం: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని, అధికారులు సమన్వయంతో పనిచేసి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం తహసీల్దార్ పమ్మిలక్ష్మి, ఎంపీడీఓ జ్యోతిర్మయి, పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కె.ప్రియాంక వైద్య సిబ్బంది క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుబాబును కలిసి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వివరాలను తెలియజేశారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో 9, పిప్పర పీహెచ్‌సీ పరిధిలో 10 వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఇంటింటా ఆరోగ్య సర్వే చేసి అవసరమైన వారికి వారి ఇంటి వద్దనే ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి టోకెన్లు ఇస్తామని, ఆ టోకెన్లతో వైద్య శిబిరానికి వస్తే నిపుణులైన వైద్యులతో సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం 45 రోజులపాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వైద్య సిబ్బందికి రెవెన్యూ, మండల పరిషత్ శాఖలు పూర్తి సహకారం అందించాలన్నారు. సీహెచ్‌ఓ జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సర్వే వివరాలను అందిస్తున్న అధికారులు

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

ఉంగుటూరు: ఆర్టీసీ బస్సు పాస్‌లను విద్యార్థులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నారాయణపురం హైస్కూల్లో హెచ్‌ఎం మీరాసాహెబ్ అధ్యక్షతన విద్యార్థులకు బస్సు పాస్‌లు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బస్ పాస్‌ల దాత వైఎస్సార్ సీపీ నాయకుడు బళ్ల త్రిమూర్తులను ఎమ్మెల్యే వాసుబాబు అభినందించారు. దాతకు ఆర్టీసీ డిపో మేనేజరు వైఎస్ఎన్ మూర్తి మెమెంటో అందజేసి సత్కరించారు. వంద మంది దివ్యాంగులకు, 295 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. 2017 నుంచి బళ్ల త్రిమూర్తులు బస్ పాస్‌లు అందజేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి పాల్గొన్నారు.

మహిళల స్వయం సమృద్ధికి పటిష్ట కార్యాచరణ

ఎమ్మెల్యే ఆళ్ల నాని



వైఎస్సార్ ఆసరా చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): మహిళల స్వయం సమృద్ధికి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి ఏలూరు నియోజకవర్గం పరిధిలో వివిధ కారణాలతో డబ్బు జమ కాకుండా మిగిలిపోయిన 27 గ్రూపులకు రూ.48.20 లక్షలు ప్రభుత్వం తాజాగా వారి ఖాతాల్లోకి జమచేసింది. ఈ మేరకు డ్వాక్రా మహిళలు మంగళవారం ఆళ్ల నానిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు అందకుండా మిగిలిపోయిన వారందరినీ గుర్తించి న్యాయం చేశామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేశామని, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా వడ్డీ రాయితీ మొత్తాన్ని ఎప్పటికప్పుడు డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు అందజేస్తున్నామని వివరించారు. డ్వాక్రా సంఘాలు బలోపేతం చేశామని, రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నిటిని మహిళల పేరు మీదే అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా నానిని డ్వాక్రా మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఓ కృష్ణమూర్తి, సీఎంఎం సుధాకర్, పలువురు కార్పొరేటర్లు, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు దాసరి వరలక్ష్మి, అమీనా అన్సారీ, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'పంటల బీమా'ను ప్రైవేటుకు అప్పగించొద్దు

భీమడోలు: పంటల బీమా పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించవద్దని కోరుతూ మంగళవారం ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో పూళ్లలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ పథకాన్ని అమలు చేయాలని, ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తే రైతులు అన్యాయం జరుగుతుందంటూ వారంతా ఆందోళన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సీజన్ నుంచి పంట బీమా పథకాన్ని బీమా కంపెనీలకు ప్రభుత్వం అప్పగించాలని నిర్ణయించిందని అన్నారు. ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తూ ఇచ్చిన జీవో 660ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగి పంటల బీమా పథకాన్ని బీమా కంపెనీలకు అప్పగించవద్దని పేర్కొన్నారు. పీఎం ఫసల్ బీమా పాలసీ బీమా కంపెనీల లాభం కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం కాదన్నారు. అనంతరం వీఏఏకు వినతిపత్రం అందించారు. ప్రతినిధులు కె.అప్పారావు, వి.శ్రీరామచంద్రమూర్తి, కోట సారధి, అల్లు హరిబాబు, ఎం.వెంకట అప్పారావు, ఎస్.వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ శాఖ ఆవిర్భావ దినోత్సవం

దెందులూరు: భారతదేశంలో రక్షణ శాఖ ఏర్పాటు చేసి 141 ఏళ్లయిన సందర్భంగా మంగళవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మేజర్ రమణయ్య, మేజర్ సువర్ణబాయి సాల్వేషన్ ఆర్మీ పతాకాన్ని ఎగుర వేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దెందులూరు సీహెచ్‌సీలో 20 మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సాల్వేషన్ ఆర్మీ సంఘ పెద్దలు, యువత, గృహ సమితి సభ్యులు పాల్గొన్నారు. కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మేజర్ సుబ్బారావు ఆధ్వర్యంలో సాల్వేషన్ ఆర్మీ పతాకాన్ని ఎగురవేశారు.

నేడు వైఎస్సార్ కాపు నేస్తం ప్రారంభోత్సవం

దెందులూరు: గంగన్నగూడెం శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం 9 గంటలకు దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ కాపు నేస్తం ప్రారంభోత్సవం, కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల కమిటీల అధ్యక్షులు, కాపు నేస్తం లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

'ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించాం'



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజల అవసరాలను గుర్తెరిగి ఇంటి వద్దకే సంక్షేమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 15 ఏళ్లుగా ఏ ఆధారం లేకుండా నివాసముంటున్న 62 కుటుంబాల అభ్యర్థన మేరకు వారికి స్థల స్వాధీన ధ్రువపత్రాల పట్టాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అందించారు. ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. వారికి అందిన లబ్ధిని కరపత్రాల ద్వారా వివరించారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలోని ఇతర సమస్యలపై ఆయన ఆరాతీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత భోగాపురం పంచాయతీ ప్రకాష్‌నగర్‌లో ఎమ్మెల్యే కొఠారుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని వినాయక మండపాన్ని సందర్శించి స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నేత ఆళ్ల సతీష్‌చౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చల్లగొళ్ల భూస్వామి, సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ అబ్బదాసు రూతమ్మ, అంకన్నగూడెం ప్రెసిడెంట్ దుక్కిపాటి మహాలక్ష్ముడు, గ్రామ నాయకులు దిమ్మిటి రమేష్, మరీదు బాలస్వామి, వేగుంట అచ్యుతరావు, నెక్కలపు జగన్మోహన్‌రావు, నడిపల్లి రామరాజు, కొమ్మిరపు నారాయణ, పురిటిపాటి సుబ్బారెడ్డి, అబ్బదాసు సుబ్బారావు, గొళ్ళ సత్యనారాయణ, రాజువరపు వెంకట్రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ,సభ్యులు పాల్గొన్నారు.

నేడు భోగాపురంలో..

పెదవేగి : మండలంలోని భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మధ్యాహ్నం 3:30 గంటల నుంచి రాత్రి 9:30 వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జానంపేట బాబు కోరారు.

వెండి కుందుల సమర్పణ



దీపారాధన కుందులను చూపిస్తున్న దాతలు

ఏలూరు (ఆర్ఆర్ పేట): స్థానిక పడమర వీధి వీర బ్రహ్మేంద్ర స్వామి విశ్వకర్మ భగవాన్ ఆలయంలో స్వామివారి పూజల నిమిత్తం నగరానికి చెందిన బంగారు ఆభరణాల వ్యాపారులు వెండి దీపారాధన కుందులు సమర్పించారు. నగరానికి చెందిన కేకేఎస్ జ్యూయలరీ అధినేత, బులియన్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర జోనల్ కన్వీనర్ కాద రాంబాబు, కాద బ్రహ్మాజీ కుటుంబ సభ్యులు ఆలయంలో స్వామివారి పూజల నిమిత్తం మంగళవారం సుమారు రూ.లక్ష విలువైన రెండు వెండి దీపారాధన కుందులను ఆలయ కమిటీ చైర్మన్ దాకోజు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి ముశినాడ శేఖర్, కోశాధికారి నాగమల్లి దుర్గారావులకు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ముంగండ శ్రీనివాస్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శాశ్వత భూ హక్కు కల్పించేందుకే రీ సర్వే

పెదపాడు: రైతులకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో శాశ్వత హక్కు కల్పించేందుకు రీ సర్వే చేస్తున్నట్లు ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ రౌతు నాగరాజు తెలిపారు. పెదపాడు మండలంలోని సకల కొత్తపల్లిలో సర్పంచ్ చేపేని రంగారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు రీ సర్వే వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. రైతులు గ్రామ సర్వేయర్లుకు సహకరించాలని తెలిపారు. మండల సర్వేయరు కోదండరామ్ గ్రామ రెవెన్యూ అధికారి అల్లు ప్రసాద్ గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

దెందులూరు: దెందులూరు కాశీకాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తోట రామాంజనేయులు, మంగతాయారు వారి కుమారులకు చెందిన రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని, వారికి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ.14 వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్టు సంస్థ అధ్యక్షుడు మేకా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం కాశీ కాలనీలో అగ్నిప్రమాద బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంస్థ సభ్యుడు, పీ నాగార్జునరావు, ఏనుగు రామకృష్ణ, ఎం. లక్ష్మణరావు, వీ.చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఏడేళ్లుగా జిల్లాలో వివిధ మండలాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తీవ్ర బాధిత కుటుంబాలకు చేయూత స్వచ్ఛందద సేవా సంస్థ తరపున నగదు, పెన్షన్, నిత్యావసర వస్తువులు అందిస్తామన్నారు. తమ సంస్థ నిర్ణయం మేరకు కాశీ కాలనీలో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తామని వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33